న్యూస్ బాక్స్

### జిల్లాకు మూడు అంబులెన్స్‌లు మంజూరు

గర్మిళ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడు 108 అంబులెన్స్‌లను మంజూరు చేశారని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజీపూర్, తాండూర్, భీమారం మండలాలకు అంబులెన్స్‌లను కేటాయిస్తామన్నారు. ప్రజలకు అంబులెన్స్‌ల ద్వారా సత్వర సేవలందుతాయని తెలిపారు. మూడు అంబులెన్స్‌లతో కలిపి జిల్లాలో మొత్తం 18 అంబులెన్స్‌లు ప్రజలకు వైద్య సేవలందిస్తాయని తెలిపారు. డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, 108 జిల్లా మేనేజర్ సంపత్‌లు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

### 11న సీఎం కప్ పోటీలు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 11న మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్ పోటీలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అల్లె మారుతీప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా పోటీలు జరుగుతాయని, పాల్గొనే వారు 9వ తేదీలోగా http://cmcup2024.telangana.gov.in వెబ్‌సైట్ లేదా టీజీ సీయూఎం 2024 మొబైల్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు 11న ఉదయం 10 గంటలకు పాఠశాల పీడీ ఆర్.రాజయ్యకు రిపోర్టు చేయాలని, వివరాలకు 9440141328 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గర్మిళ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని ఏసీసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వేణుగోపాల్, ఏఈ శ్రావణ్ కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనగర్, వికాస్‌నగర్, మారుతినగర్, డీసీపీ ఆఫీస్, సావిత్రినగర్‌లో విద్యుత్ ఉండదని తెలిపారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి డివిజన్‌లో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉం టుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. తాండూర్, భీమిని, బెల్లంపల్లి, నెన్నెల, కాసిపేట, వేమనపల్లి మండలాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

### ధాన్యం కొనుగోలులో జాప్యం చేయవద్దు

జన్నారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో జాప్యం చేయవద్దని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పొనకల్, దేవునిగూడెం, కిష్టాపూర్‌లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అకాల వర్షాలు కురుస్తున్నాయని,వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు.

వెన్నెలలో తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకుంటున్న రైతులు



# వర్షం...నష్టం...

- కళ్లాల్లో తడిసిన ధాన్యం
- చేతికి వచ్చిన పంట నీళ్లపాలు
- పత్తి రైతులకూ తీరని నష్టం

మంచిర్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యానికి జిల్లాలోని రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఆరుగాలం శ్రమించి సాగుచేసిన వరి, పత్తి పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షానికి తడిసిపోవడంతో నష్టం వాటిల్లింది. శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి జిల్లాలోని వేమనపల్లి, బెల్లంపల్లి, దండేపల్లి, జన్నారం మండలాల్లో అధిక నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. నాలుగైదు రోజులుగా వాతావరణం మబ్బులు పట్టి ఉండటంతో జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ పంట నీళ్ల పాలయిందని రైతులు వాపోతున్నారు.



హాజీపూర్ మండలంలో తడిసిన ధాన్యం

రైతులు ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తరలించి, తేమ శాతం తగ్గించేందుకు కల్లాల్లో ఆరబెట్టారు. తేమ శాతం తగ్గనిదే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం సేకరించరనే ఉద్దేశ్యంతో వర్ష సూచన ఉన్నప్పటికీ ఆరబోయక తప్పని పరిస్థితి నెలకొంది. మరోవైపు వరి పంట కోతకు వచ్చిన చోట్ల కూడా వర్షం కారణంగా నష్టం వాటిల్లే పరిస్థితులు ఉన్నాయి. అలాగే పత్తి పంట సైతం పెద్ద ఎత్తున తడిసింది. పత్తి సేకరించే దశలో చెట్టుపైనే తడిసి ముద్దకావడంతో రైతులకు నష్టం వాటిల్లింది.



నెన్నెల మండలంలో తడిసిన పత్తి

#### కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో....

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయడంతో జిల్లా వ్యాప్తంగా వరి పంటకు పెద్దగా నష్టం వాటిల్లలేదని తెలుస్తోంది. వానాకాలం సీజన్‌కు సంబం ధించి జిల్లాలో 1,60,605 ఎకరాల్లో వరి సాగు చేయగా 3,68,140 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో ప్రైవేటులో అమ్మకాలు, పంట నష్టాలు పోను కనీసం 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించనున్నారు. మరోవైపు రైతులు కోసిన పంటను కోసినట్లుగా కళ్లాలకు తరలిస్తున్నారు. అక్కడ ఆరబెట్టి తేమ తగ్గగానే విక్రయిస్తున్నారు. జిల్లాలో మొత్తం 326 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని లక్ష్యం కాగా 315 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా శనివారం నాటికి 14,191 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యానికి సంబంధించి రూ.13.67 కోట్లు 914 మంది రైతుల ఖాతాల్లో జమ చేశారు. దీంతో కళ్లాల్లో పెద్దగా ధాన్యం లేకపోవడంతో నష్టం శాతం తగ్గింది. కొద్ది మొత్తం మాత్రమే కళ్లాల్లో ఆరబోసిన ఉండగా, రైతులు ముందు జాగ్రత్తగా టార్పాలిన్లు కప్పడంతో నష్టాన్ని నివారించగలిగారు. సన్నరకం సాగు చేసిన రైతులు పెద్ద

మిగతా 7వ పేజీలో

#### పత్తి పంటకు నష్టం...

అకాల వర్షానికి పత్తి రైతులకు అపార నష్టం వాటిల్లింది. ఈ సీజన్‌లో జిల్లాలోని 1,57,645 ఎకరాల్లో రైతులు పత్తిసాగు చేయగా 16,10,495 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా మొదటి దశను నవంబరు నుంచి డిసెంబరు మొదటి వారంలో చేరాల్సి ఉండగా, రెండో దశలో డిసెంబరు నుంచి జనవరి మొదటి వారంలోగా, మూడో దశలో డిసెంబరు చివరి వారం నుంచి ఫిబ్రవరి మొదటి వారంలోగా పూర్తవుతుందని అంచనా వేశారు. మొదటి దశ పత్తి ఏరుతుండగానే అకాల వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా కేవలం 40 శాతం మాత్రమే ఏరినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు కేవలం 5 లక్షల పైచిలుకు క్వింటాళ్లు మాత్రమే పత్తి చేతికి వచ్చినట్లు సమాచారం. మిగతా 60 శాతం చేలలోనే ఉండిపోయింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి చెట్లపై ఉన్న పత్తి పూర్తిగా తడిసిపోయింది. పత్తి తడిసిపోవడంతో రంగు మారి నల్లబడి పోతుందని రైతులు తెలిపారు. సీసీఐ కేంద్రాల్లో పత్తిలో నాణ్యత లేదని, ధరలో భారీగా కోతపెట్టే అవకాశాలు ఉన్నాయని వాపోతున్నారు.



## కోనోకార్పస్ చెట్లు తొలగింపు

స్పందించిన మున్సిపల్ అధికారులు

మంచిర్యాల, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): ప్రజల ప్రాణాలకు హాని తలపెట్టే కోనోకార్పస్ చెట్లను మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు తొలగించారు. పచ్చదనం కోసం జిల్లా కేంద్రంలోని డివైడర్ల మధ్య పెంచుతున్న కోనోకార్పస్ మొక్కలు ఆరోగ్యరీత్యా ప్రమాదకరమని, వైద్యులు హెచ్చరిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని పేర్కొంటూ 'ఆంధ్రజ్యోతి'లో 'కోనోకార్పస్ మొక్కలతో ముప్పే' శీర్షికన ఈ నెల 1న వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు శనివారం సిబ్బందితో వాటిని తొలగించారు. కోనోకార్పస్ మొక్కల కారణంగా ఇతర మొక్కలు పెరగక పోవడంతోపాటు పర్యావరణం, మనుషులు, జంతువులకు హాని కలిగిస్తున్నాయి. ఆ చెట్ల నుంచి వెలువడే పుప్పొడి రేణువులు ప్రజలకు అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా వంటి రుగ్మతలు కలిగిస్తాయి. అలాగే కోనోకార్పస్ మొక్క వేర్లు భూమిలో లోతుల్లోకి పాతుకు పోయి, నీటిని అధికంగా వినియోగిస్తుండటంతో సమీప ప్రాంతాల్లో బోర్లలో నీరు లోతుల్లోకి వెళ్లే ప్రమాదం పొంచి ఉంది. తద్వారా భూగర్భ జలాలు అడుగంటేందుకు కోనోకార్పస్ మొక్కలు దోహదం చేస్తాయని నిపుణులు పేర్కొన్నారు.



డివైడర్ల మధ్య పెరిగిన కోనో కార్పస్ మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

కాగా వార్తా కథనం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు దృష్టికి రావడంతో డివైడర్ల మధ్య కోనోకార్పస్ మొక్కలను తొలగించి, వాటి స్థానంలో ఇతర మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు ఐబీ చౌరస్తా మొదలుకొని లక్ష్మీ టాకీస్ కూడలి వరకు రోడ్డు డివైడర్ల మధ్య ఉన్న కోనోకార్పస్ మొక్కలన్నింటినీ తొలగిస్తున్నారు.

## వీడని భయం

- పులి నుంచి రక్షణకు.. మాస్క్
- గ్రామస్థులకు పంపిణీ చేసిన అధికారులు
- పులి కోసం డ్రోన్లతో వేట
- గుంపులుగా పత్తి సేకరణ

6



మాస్క్‌లతో పనులకు వెళుతున్న కూలీలు

## సైకిల్ సవారీ

- నాడు సైకిల్ ప్రధాన రవాణా సాధనం
- కిరాయికి ఇచ్చేందుకు సైకిల్ స్టాండ్లు
- ప్రస్తుతం తగ్గిపోతున్న వాడకం

7





కోటపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ మురళి

## ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య

పాఠశాలలను సందర్శించిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

జైపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య అందిస్తున్నట్లు తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఇందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు కష్టపడి కాదు, ఇష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరుశాతం ఎలా ఉంది అని వాకబు చేశారు. పాఠశాలలో ఏమైనా సమస్యలున్నాయా, వసతులపై ఆరా తీశారు. పాఠశాలలోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టాయిలెట్లు, సైన్స్‌ల్యాబ్, తరగతి గదులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, వంటశాలలను పరిశీలించారు. సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులతో కరచాలనం చేసి ఓటమి, గెలుపులు సహజమని, వాటిని పట్టించుకోకుండా క్రీడల్లో భాగస్వాములు కావాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా విద్యాధికారి యాదయ్య, మండల విద్యాధికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుమన్ ఉన్నారు.

#### నాణ్యమైన ఆహారం అందించాలి

భీమారం, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని విద్యా శాఖ చైర్మన్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించారు. మూత్రశాలలు, పాఠశాలల పరిసరాలను, తాగునీటి వసతిని పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు.

అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠా లు బోధించాలని సూచించారు. మండలానికి జూని యర్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యాశాఖ చైర్మన్‌కు యువకులు విన్నవించారు. డీఈవో యాదయ్య, సెక్టోరి యల్ అధికారులు సత్యనారాయణ మూర్తి, చౌదరి, ఇన్‌చార్జీ హెచ్‌ఎం శ్రీనివాస్, తిరుపతి ఉన్నారు.

#### సమస్యలు తెలుసుకుంటూ...

**కోటపల్లి, (ఆంధ్రజ్యోతి):** విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కళాశాల, బాలికల హాస్టల్, కేజీబీవీ పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ముందుగా మోడల్ స్కూల్‌కు వచ్చిన ఆయన పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య, హాజరు శాతంపై వివరాలు నమోదు చేసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఉపాధ్యాయులను అడిగారు. అదనపు గదులు, ల్యాబ్ సమస్యలను విద్యా కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. 6వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులతో ఇంగ్లీష్ సబ్జెక్టుకు సంబంధించి పాఠ్యాంశాన్ని చదివించారు. బేస్‌లైన్ టెస్టులు పెట్టాలని ఆదేశించారు. విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని, 7వ తరగతి విద్యార్థులకు సైతం పదో తరగతి మాదిరి గానే పరీక్షలు పెట్టాలని, ఉత్తీ ర్ణులు కానట్లయితే మరో రెండు నెలలు ప్రత్యేకంగా బోధించి పరీక్షలు పెట్టి ఉత్తీర్ణత సాధించాకే పై తరగతులకు పంపిస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం బాలికల హాస్టల్‌ను పరిశీలించిన ఆయన విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. కేజీబీవీ పాఠశాలను సందర్శించిన 6వ తరగతి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఎంఈవో వెంక టేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

#### విద్యా కమిషన్ చైర్మన్‌కు వినతి

మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న హవర్లీ బేస్డ్ టీచర్స్ (హెచ్‌బీటీ)ల సమస్యలను పరిష్కరించాలని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి కోటపల్లి మోడల్ స్కూల్ హెచ్‌బీటీలు వినతిపత్రం అందించారు. వేతనం పెంపు, ఉద్యోగ భద్రత, 12 నెలల పాటు వేత నం సమస్యలను పరిష్కరించాలని చైర్మన్‌కు విన్నవిం చారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. మరో వైపు 010 పద్దు ద్వారా తమకు వేతనాలు అందించాలని, పాఠశాల రెగ్యులర్ ఉపాధ్యాయులు విద్యా కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందించారు. మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది సైతం వేతనాలు పెంచాలని విన్నవించారు. హెచ్‌బీటీ సంఘం నాయకులు వెంకట రమణ, సలీం, ఆమని, సంపత్, హరికృష్ణరెడ్డి పాల్గొన్నారు.



భీమారంలో విద్యార్థులతో భోజనం చేస్తున్న ఆకునూరి మురళి

### కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలను రెగ్యులరైజేషన్ చేయాలని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు నిరసన దీక్ష చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగుల రెగ్యులరైజేషన్, పే స్కేల్ అమలు చేయాలన్నారు. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలన్నారు. జీవిత, ఆరోగ్య బీమా రూ.10 లక్షలు, పదవీ విరమణ బెనిఫిట్స్ రూ.10 లక్షలు అందించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సుమలత, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రాజన్న, జిల్లాలోని వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

### విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి మహ్మద్ అసదుల్లా షరీఫ్

జన్నారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లక్సెట్టిపేట సివిల్ కోర్టు న్యాయాధికారి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. శనివారం రాఘవేంద్ర విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. సోషల్ మీడియా, చెడు అలవాట్లకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గడికొప్పుల కిరణ్, జనరల్ సెక్రెటరీ రమేష్, ఏజీపీ సత్యం, మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, న్యాయవాదులు రాజేశ్వర్ రావు, రాజారాంరెడ్డి, రవీందర్, రహ్మతుల్లా, సత్యగౌడ్ పాల్గొన్నారు.

### అటవీ అధికారులను అడ్డుకున్న ఆదివాసీలు



అటవీ శాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీలు

కాసిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రొట్టెపల్లి అటవీ శివారులో సాగులో ఉన్న ప్రభుత్వ భూములను అటవీ శాఖకు అప్పగించడాన్ని నిరసిస్తూ శనివారం ఆదివాసీ గిరిజనులు ఆందోళన చేపట్టారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా ఓరియంట్ సిమెంట్ కంపెనీ సీఏల్యాండ్స్ కింద ప్రభుత్వ భూములను కొనుగోలు చేసి అటవీ శాఖకు అప్పగించేందుకు ఐఆర్‌వో త్రినాథరావు, డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్, ఓరియంట్ అధికారులు రావడంతో ఆదివాసీ గిరిజనులు అడ్డుకున్నారు. తుడుందెబ్బ జిల్లా నాయకుడు పెంద్రం హన్మంతు మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో 1/70 చట్టం, పీసా యాక్టు అమలులో ఉండగా గ్రామసభలు లేకుండా భూములను లాక్కోవడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దేవాపూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామసభల ద్వారానే భూములను పరిశీలిస్తామని చెప్పడంతో ఆదివాసీలు ఆందోళన విరమించారు. టేకం శ్రీను, జగన్, కృష్ణ, భీంరావు, రాజు, స్థానికులు పాల్గొన్నారు.

### లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. శనివారం మైనార్టీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కాకా వెంకటస్వామి నిరుపేద ప్రజలకు వైద్యంతోపాటు బ్లడ్ బ్యాంకు కోసం లయన్స్‌క్లబ్‌కు రూ. 10 లక్షలు ఇచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. చెన్నూరు, కోటపల్లి,వేమనపల్లి, భీమారం, జైపూర్ మండలాలతో పాటు సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి సైతం ప్రజలు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు, వైద్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కస్తూర్బాగాంధీ కళాశాల విద్యార్థినికి ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఉచితంగా పుస్తకాలు అందించారు. కాలేజీలో టాపర్‌గా నిలువుగా నీట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

### ఒకే దఫా రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): రైతులకు ఒకేసారి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. పొన్నారంలో రూ.1.50 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, పీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, చిర్రకుంట మాజీ సర్పంచు కొమురయ్య, నాయకులు కడారి జీవన్ కుమార్, రాజలింగు, సంతోష్, పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### చిరుతదాడిలో ఆవు మృతి

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): చిరుత పులి దాడిలో ఆసిఫాబాద్ మండలం గంటలగూడెం అటవీ ప్రాంతంలో ఆవు మృతి చెందింది. బాబాపూర్ గ్రామానికి చెందిన బానోత్ రాములుకు చెందిన పశువులు మేత కోసం అటవీప్రాంతానికి వెళ్లగా చిరుత దాడి చేసి ఆవును చంపేసింది. విషయాన్ని అటవీఅధికారులకు తెలుపగా జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్, సెక్షన్అధికారులు మహేందర్, చంద్రకాంత్, బీట్ అధికారులు సాదిక్, స్వప్న, మారుతిలు పరిశీలించి దాడి చేసింది చిరుత పులిగా నిర్ధారించారు. బాధితుడికి అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. రేంజ్అధికారి మాట్లాడుతూ ప్రజలు పులి సంచారంకు సంబంధించి సమాచారం తెలియజేయాలన్నారు. ఎనిమల్ ట్రాకర్ సాయి పాల్గొన్నారు.

### ఆవుపై పెద్దపులి దాడి


పులి దాడిలో గాయపడిన ఆవు

వేమనపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడ్డుగూడెం అటవీ సెక్షన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం ఆవుల మందపై పెద్దపులి దాడి చేసింది. కుష్నపల్లి ఎఫ్ఆర్‌వో దయాకర్ తెలిపిన వివరాల ప్రకారం సుంపుటం గ్రామానికి చెందిన పశువుల కాపరి ఆవుల మందను తీసుకుని ఒడ్డుగూడెం అటవీ ప్రాంతానికి వెళ్లాడు. పెద్దపులి ఆవుల మందపై దాడి చేయగా ఒక ఆవు మెడపై గాయమైంది. ఇంటికి చేరుకొన్న ఆవును గమనించిన యజమాని హనుమయ్య ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. డిప్యూటీ ఫారెస్టు రేంజ్ అధికారి రూపేష్, ఒడ్డుగూడెం సెక్షన్ అధికారి బేగ్‌లు ఘటన స్థలంలో పరిశీలించారు. పులి పాద ముద్రలు ఉన్నాయని తెలిపారు. ఆవులు చెల్లాచెదురయ్యాయని, వాటిపై పులి దాడి చేసిందా లేదా తెలియదని పేర్కొన్నారు. అటవీ సమీప గ్రామాలైన ఒడ్డుగూడెం, మంగెనపల్లి, జాజులపేట, ముక్కిడిగూడెం గ్రామాల ప్రజలకు అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. అటవీ సమీప ప్రాంతాలకు పత్తి చేన్లకు వెళ్లవద్దని సూచించారు. గాయపడిన ఆవుకు పశువైద్యుడు చికిత్స అందించారు.

### విద్యుదాఘాతంతో మహిళ మృతి


సుమలత (ఫైల్)

తాండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదారం గ్రామానికి చెందిన పులగం సుమలత (37) ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌తో శనివారం మృతి చెందింది. సుమలత దుస్తులను ఇనుప తీగపై ఆరేస్తుండగా తీగకు విద్యుత్ వైరు తగిలి ఉండడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఆమెను గమనించలేదు. కొంత సేపటి తర్వాత చుట్టుపక్కల వారు గమనించి సమాచారం ఇచ్చారు. మృతురాలుకు భర్త పులగం తిరుపతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలు తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సౌజన్య తెలిపారు.

### రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన కనవేణి శ్రీనివాస్ (38) అనే వ్యక్తి శనివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపారు. శ్రీనివాస్ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిపారు. ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో నుంచి వెళ్లి పట్టణంలో ఓవర్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని, భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

సిర్పూర్(టి), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం ప్రమాదవశాత్తు రైలు ఢీకొని కాగజ్‌నగర్ పట్టణంలోని న్యూకాలనీకి చెందిన అబ్బాస్ బేగం (80) మృతి చెందినట్లు జీఆర్పీ సురేష్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... అబ్బాస్‌బేగం భిక్షాటన చేస్తూ ఉండేది. సాయంత్రం ఇంటికి వెళ్లే క్రమంలో సిర్పూర్(టి)రైల్వే స్టేషన్ రాగా గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

### 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

బెజ్జూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలించేందుకు నిల్వ ఉన్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పక్కా సమాచారం మేరకు మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి సోదాలు నిర్వహించగా ఒకరి ఇంట్లో 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించాయన్నారు. దీంతో నిల్వ ఉంచిన సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్వాధీనపర్చుకుని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు డీటీ తెలిపారు.

### వాహనాల తనిఖీ

వేమనపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పీఎల్‌జీఏ వారోత్సవాలను పురస్కరించుకుని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ శనివారం దస్నాపూర్ నుంచి కన్నెపల్లి వెళ్లే రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల వివరాలను తెలుసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

### పోస్టర్ల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన మత్తు పదార్థాలను వ్యతిరేకిద్దాం బంగారు భవిష్యత్ బాటలు వేద్దాం పోస్టర్లను శనివారం సీఐ ప్రమోద్‌కుమార్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, నాయకులు మల్లేష్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

### రైతుల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని శనివారం ఎంసీపీఐయూ నాయకులు హైద్రాబాద్‌లో అగ్రికల్చర్ కమిషనర్ అండ్ డైరెక్టర్ గోపిని కలిసి వినతిపత్రం అందించారు. జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేష్‌లు మాట్లాడుతూ నియోజకవర్గంలో అధికంగా పత్తి సాగు చేశారని, సీసీఐలో పత్తి అమ్మడానికి వెళితే దళారులతో సీసీఐ నిర్వాహకులు కుమ్మక్కై టోకెన్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, రెగ్యులర్ సెక్రటరీని నియమించాలని కోరారు.

### అసంక్రమణ వ్యాధుల క్లినిక్ పరిశీలన

గర్మిళ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అసంక్రమణ వ్యాధుల క్లినిక్‌ను పరిశీలించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కౌన్సెలింగ్, నిర్ధారణ చికిత్సలు అందించడానికి ఏర్పాటు చేసిందన్నారు. లింగారెడ్డి, లక్ష్మణస్వామి, ప్రశాంతి, వెంకటేశ్వర్ ఉన్నారు.

### డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్‌ల జాబితా విడుదల

కాసిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీల వారీగా శనివారం డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్‌ల జాబితాను ఎంపీడీవో సత్యనారాయణసింగ్ విడుదల చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో నోటీసు బోర్డుపై ప్రదర్శించామన్నారు.

# వీడని భయం


మాస్కులు ధరించి పత్తి ఏరుతున్న కూలీలు

- పులి నుంచి రక్షణకు.. మాస్క్
- గ్రామస్థులకు పంపిణీ చేసిన అధికారులు
- పులి కోసం డ్రోన్లతో వేట
- గుంపులుగా పత్తి సేకరణ

కాగజ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇప్పుడు కాగజ్‌నగర్ డివిజన్‌లో ప్రతి ఒక్కరి నోటా పులి మాటే. ప్రజల్లో అంత భయం రేకెత్తించింది పులి. పత్తి పంట ఏరివేత దశకు ఇదే అనువైన కాలం. ఇటువంటి సందర్భంలో పులి కూలీల్లో భయాందోళన రేకెత్తించింది. దీంతో ఏమాత్రం పులి మాట వినిపించినా కూలీలు పని మానేసి అర్ధాంతరంగా ఇంటి ముఖం పడుతున్నారు. డబ్బులు లేకున్నా సరే ప్రాణాలుంటే ఎలాగైనా బతకొచ్చంటూ కూలీలు పత్తి ఏరేందుకు ముందుకు రావటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అటవీశాఖ అధికారులు నూతన పంథాకు తెరలేపారు. పులి దాడి వెనుక నుంచి చేస్తుందని, తలవెనుక వైపు మాస్క్ ధరిస్తే దాడి చేయదని సూచిస్తూ చేనులకు వెళ్లే కూలీలకు అటవీశాఖ అధికారులు అవగాహన కలిపిస్తున్నారు. మాస్క్‌లే సురక్షితమని సూచిస్తున్నారు.


పులి కోసం డ్రోన్లతో వెతుకున్న అధికారులు(ఫైల్)

#### పులి కోసం వేట..

పది రోజుల నుంచి సిర్పూరు నియోజకవర్గంలోని కాగజ్‌నగర్, సిర్పూరు(టి)ప్రాంతాల్లో పులి వరుస దాడులు చేస్తుండటంతో అంతా భయాందోళనకు గురి చేస్తున్నారు. గతనెల 29న పత్తి ఏరుతున్న కూలీ లక్ష్మి(22)పై దాడి చేసి చంపేసిన సంఘటన నుంచి తేరుకోక ముందే నజ్రూల్‌నగర్ క్యాంపులో ఆవుపై దాడి చేసింది. గత నెల 30న సిర్పూరు(టి)లో పత్తి ఏరుతున్న రౌతు శంకర్‌పై దాడి చేసి గాయపర్చింది. ఈ సంఘటనల నుంచి ఇంకా కూలీలు కోలుకోలేని పరిస్థితి ఉంది. పులి జాడను కనిపెట్టేందుకు అటవీశాఖ అధికారులు డ్రోన్ల సహాయంతో వెతుకుతున్నారు. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌లో దాడిచేసిన పులి నేరుగా సిర్పూరు(టి) ప్రాంతంలోకి వెళ్లినట్టు అధికారులు నిర్ధారించారు. మహారాష్ట్రకు వెళ్లినట్టు అంచనా వేసినప్పటికీ శుక్రవారం మళ్లీ గెదె, దూడపై దాడి చేయటంతో పులి ఈ ప్రాంతంలోనే తిరుగుతున్నట్లు అధికారులు నిర్ధారించారు. టైగర్ కారిడార్ గ్రామాల్లో అటవీశాఖ అధికారులు అవగాహన సదస్సులు పెడుతున్నారు.

#### పాటించాల్సిన నిబంధనలు..

పత్తి ఏరేందుకు వెళ్లే కూలీలు వేకువజామున ఎట్టి పరిస్థితుల్లో వెళ్లరాదంటున్నారు. ఉదయం 10 గంటల తర్వాత పొలాల్లో పత్తి ఏరేందుకు వెళ్లాలి. అది కూడా కూలీలు గుంపుగుంపులుగా ఉండాలి. వంగి పత్తి ఏరే సమయంలో తప్పకుండా మాస్క్ ధరించాలి. మాస్క్ ధరిస్తే పులి ఎట్టి పరిస్థితుల్లో దాడి చేయదు. అలాగే సాయంత్రం నాలుగు గంటల కల్లా పత్తి ఏరివేతను ముగించుకొని మళ్లీ గుంపులుగుంపులుగా రావాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ నిబంధనలను గ్రామీన ప్రాంతా ప్రజలు తప్పకుండా పాటించాలని సూచిస్తున్నారు.

#### అప్రమత్తంగా ఉండాలి..
**శశిధర్ బాబు, రేంజ్ అధికారి, కాగజ్‌నగర్**

పులి సంచారం జరుగుతున్నట్టు సోషల్ మీడియాలో పాత వీడియోలతో పోస్టులు పెడుతున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దు. పత్తి ఏరే కూలీలకు మాస్క్‌లను అందిస్తున్నాం. ఈ మాస్క్‌లు తలకువెనుక వైపు ఉండేట్లు చూడాలి. పత్తి ఏరే సమయంలో కూలీలంతా గుంపులు గుంపులుగా ఉండాలి. ఉదయం 10గంటల తర్వాతనే పొలాల్లోకి వెళ్లి, సాయంత్రం నాలుగు గంటల లోపు ఇంటి ముఖం పట్టారు. పులిపెగ్ మార్క్ కన్పిస్తే తప్పకుండా తమకు సమాచారం అందించాలి. ట్రాకర్స్ ద్వారా సమాచారం ఎప్పటికప్పుడు సేకరిస్తున్నాం. పులుల సంతానోత్పత్తి సమయం కాబట్టి మహారాష్ట్ర నుంచి ఈ ప్రాంతానికి పులులు వలస వస్తున్నాయి.


కూలీలకు జాగ్రత్తలు వివరిస్తున్న అటవీ శాఖ అధికారులు(ఫైల్)

### 10నుంచి సీఎం కప్ పోటీలు

సిర్పూర్(యు), డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషతు కార్యాలయం ఆవరణంలో ఈనెల 10నుంచి 12వరకు సీఎం క్రీడా కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణారావ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తామని ఆసక్తిగల క్రిడాకారులు గ్రామ కార్యదర్శుల వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

**కౌటాల:** మండలంలోని గుండాయిపేట గ్రామంలో శనివారం సీఎం కప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో హనుమంతు ప్రారంభించి క్రీడకారులను పరిచయం చేసుకున్నారు.

**తిర్యాణి:** మండలకేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ పోటీలను ఎంపీడీవో మల్లేష్ ప్రారంభించారు. కార్యకరమంలో జిల్లా క్రీడాధికారి మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శంకర్, పీడీ లక్ష్మణ్, కోచ్ విద్యాసాగర్, పీడీ రవి, తదితరులు పాల్గొన్నారు.

**లింగాపూర్:** సీఎంకప్ క్రీడల్లో పాల్గొనదలిచే క్రీడకారులు తమపేర్లు గ్రామ కార్యదర్శుల వద్ద ఈనెల9లోగా నమోదు చేసుకోవాలని లింగాపూర్ ఇన్‌చార్జి ఎంపీడీవో క్రిష్ణారావు, తహసీల్దార్ రాజేంద్ర ప్రసాద్ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఈనెల 10నుంచి 12వరకు నిర్వహిస్తామన్నారు.

### నాణ్యమైన విద్యనందించాలి

జైనూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని మండల విద్యాధికారి మధుకర్ అన్నారు. మండలంలోని గూడమామడ, పాట్నాపూర్, ఉషేగాం, జెండాగూడ తదితర ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్ని శనివారం ఆయన తనిఖీచేశారు. విద్యార్థులు ప్రతిరోజు రెగ్యులర్‌గా పాఠశా లలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు.

### ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

వాంకిడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్, సైన్స్‌సఫారీ, వైజ్ఞానికసైన్స్ లిటరేచర్-2024కు వాంకిడి మండల కేంద్రానికి చెందిన వడ్లూరి రాజేష్ అనే ఉపాధ్యాయుడు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆయనను శనివారం సాయిగోపాల పాఠశాలలో మండలంలోని వివిధసంఘాల నాయకులు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఉపాధ్యాయుడు వడ్లూరీ రాజేష్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్కార్ అశోక్, లక్ష్మణ్ సేవాసదన్ సంస్థ చైర్మన్ గాదేఅవినాష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్నులే నారాయణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### సత్వరమే దరఖాస్తులు చేసుకోవాలి

జైనూర్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచం లొద్ది కస్తుర్బాగాంధీ కళాశాలలో తొలిరోజు అతిథిఅధ్యాపకపోస్టుకు దరఖాస్తులు రాలేదని ప్రత్యేక అధికారి సుమలత పేర్కోన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున ఇంగ్లీష్ అతిథి అధ్యాపకుల అవసరం ఎంతో ముఖ్యమన్నారు. పీజీపూర్తి చేసి బీఈడీకల్గిన వారు సత్వరమే దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

### మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

జైనూర్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి శనివారం జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువ, బోకేలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సముచిత న్యాయం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో కోలాం సంఘం నాయకులు గుస్సాడీ టీం లీడర్ ఆత్రం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల రిలే దీక్షలు


రిలే దీక్షల్లో కూర్చున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూకలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్ష శనివారం రెండోరోజుకు చేరుకుంది. ఈసందర్భంగా సమస్యలు పరిష్కరించాలని విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు శృతిక, నాగసుధ, తుకారాం, నగేష్, పవన్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

**వాంకిడి:** సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని శనివారం రాష్ట్రవిద్యాశాఖ కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్‌కు ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్‌చేసి జీవితబీమా రూ.10లక్షలు, ఆరోగ్యబీమా రూ.10లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. పదవీవిరమణ పొందిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25లక్షలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మోహన్, తుకారాం, సంతోష్, సందీప్, రవి, తులసీరాం, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల ఇంటివద్ద కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ1అధికారులు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులకు గనిలోని కార్యాలయంలో కౌన్సెలింగ్ చేశారు. అయితే15మంది కౌన్సెలింగ్ కురాలేదు. ఈవిషయంతెలుసుకున్న అధికారులు శనివారం ఉద్యోగుల ఇంటివద్దకు వెళ్లారు. ఎందుకు విధులకు రావడంలేదు. కౌన్సెలింగ్‌కుఎందుకురాలేదు అనేవిషయాలను కుటుంబసభ్యులనుంచి సేకరించారు.అనారోగ్యం, ప్రమాదాలు, వ్యక్తిగతసమస్యలున్నవారిని గుర్తించివారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికితీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

### రిటైర్డ్ ఉద్యోగులకు రూ.33 కోట్ల లాభాల వాటా

శ్రీరాంపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరంలో పనిచేసి ఏప్రిల్ 1, 2024 నుంచి సెప్టెంబరు 30, 2024 మధ్యలో రిటైర్ అయిన ఉద్యోగులకు ఈ నెల 12న 33 కోట్ల రూపాయల లాభాలవాటా చెల్లించనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. 2035మంది రిటైర్డ్ ఉద్యోగులకు ఈవాటా వర్తిస్తుందని, 12వ తేదీ లోగా వారివారి బ్యాంకుఖాతాల్లో జమచేయా లని సంబంధిత అధికారులను ఆదేశించారు.




### రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

శ్రీరాంపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోల్‌పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఎం బాబురావు, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపప్రధానకార్యదర్శి అశవందార్ వేణుమాధవ్, వెంకట్ రమణ పేర్కొన్నారు. ఈమేరకు వారు హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సమావేశంలో జాతీయ అధ్య క్షుడు జి సంజీవరెడ్డి, రాష్ట్ర సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. పెన్షన్ పెంచాలని, అపరిమిత ఉచిత వైద్యం అందించాలని కోరారు.

### సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యం

శ్రీరాంపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) :కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గోదావరి లోయ బొగ్గుగని కార్మికసంఘం(టీజీఎల్‌బీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి ఐ కృష్ణ ఆరోపించారు. సంఘం రాష్ట్రస్థాయి సమావేశం ఎండీ చాంద్‌పాషా అధ్యక్షతన శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, ఇటీవల జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్మికులకు మేలుచేసే విధంగా కాకుండా లోపాయికారి, లొంగుబాటు ఒప్పందాలు చేసుకుందని ఆరోపించారు. తమ సంఘం ఆధ్వ ర్యంలో కార్మికసమస్యలపై పోరాటం చేస్తామని, ఇందుకు అవసరమైన కార్యక్రమాలను నిర్ణయించుకున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్, కార్యదర్శులు ఎండీ జాఫర్, మల్లేశ్, అశోక్, కిష్టన్న, తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు

కాసిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం కాసిపేట 1వ గనిలో జరిగిన గేట్‌మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంచేస్తే అనేక ఉద్యమాలు చేశామన్నారు. కానీ కొన్ని సంఘాలు అబద్ధపు ప్రచారాలు చేస్తూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నారని వారిమాటలను నమ్మవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్రకమిటీ సభ్యుడుఅక్బర్అలీ, బెల్లంపల్లిబ్రాంచ్ ఇన్‌చార్జీ చిప్పనర్సయ్య, బ్రాంచ్‌కార్యదర్శి దాగంమల్లేష్ పాల్గొన్నారు.

### సులువైన పనులు కూడా చేయకుంటే ఎలా: జీఎం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ప్రస్తుతం సులువైన పనులు ఉన్నప్పటికీ వాటినికూడా చేయలేని పరిస్థితుల్లో ఉద్యోగులు ఉండడం దారుణమని మందమర్రి జీఎం దేవేందర్ ఆవేధన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక సీఆర్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గతంలో తట్టచెమ్మస్‌తో కోల్‌ఫిల్లింగ్ పనులు ఉండేవని, అలాంటి పనులనే అప్పటి కార్మికులు ఒక్కరోజు కూడా గైర్హాజరు అయ్యేవారు కాదని తెలిపారు. చాలామంది డిస్మిస్‌కు దగ్గర్లో ఉన్నారన్నారు. ఇప్పటికైనా గైర్హాజరు కార్మికులు సక్రమంగా విధులకు హాజరై పనిని కాపాడు కోవాలన్నారు. మందమర్రి ఏరియాలో 102మంది గైర్హాజరు కార్మికులకు 55మంది హాజరయ్యారు. కార్యక్రమంలో బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్‌గనుల సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

### రేపటిలోగా వేతనాలు పెంచకుంటే ఆందోళనలు


సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

శ్రీరాంపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈనెల9లోగా వేతనాలు పెంచకుంటే 10వ తేదీన చలో ప్రజాభవన్ కార్యక్రమం చేపడతామని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) డివిజన్‌కార్యదర్శి గట్టు మహేందర్ హెచ్చరించారు. శ్రీరాంపూర్ ఓసీపీలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుహామీలు ఇచ్చారని, కానీఏడాదికావస్తున్నా ఇంతవరకు నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ఈనెల9వ తేదీలోగా వేతనాలు పెంచకుంటే 10న ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంపతి, అశోక్, ప్రభాకర్, సన్నీ పాల్గొన్నారు.

### సంస్థ అభివృద్ధికి పారిశ్రామిక సంబంధాలు దోహదం

శ్రీరాంపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సంస్థ అభివృద్ధికి పారిశ్రామిక సంబంధాలు దోహదం చేస్తాయని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వి సూర్య నారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, రాష్ట్రకార్యదర్శి కె రాజ్‌కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం జీఎం కార్యాలయంలో గుర్తింపు సంఘం, ఏరియా యాజమాన్యం నడుమ కో-ఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి, ఉత్పత్తి, ఉత్పాదకత పెంపునకు మెరుగైన పారిశ్రామిక సంబంధాలు దోహదపడతాయని పేర్కొన్నారు. గుర్తింపు సంఘం సహకారం ఎల్లవేళలా అవసరం ఉంటుందని జీఎం కోరగా, సహకరించేందుకు యూనియన్ ముందుంటుందని నాయకులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### కోర్టు తీర్పును పరిగణలోకి తీసుకోవాలి

మందమర్రి టౌన్, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అత్యున్నత న్యాయస్థానం 2016జనవరి నుంచి 2018మార్చి వరకు ఉద్యోగవిరమణ చేసిన కార్మికులకు 20లక్షల గ్రాట్యుటీ చెల్లించాలని తీర్పునిచ్చిందని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్, పార్వతిరాజిరెడ్డి తెలిపారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అప్పుడు దిగిపోయిన వారందరు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వెల్ది సుదర్శన్, ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, చొప్పరి రామస్వామి, అశోక్, థామస్, తదితరులు పాల్గొన్నారు.

### బ్యాంకు ఖాతాలు తెరుచుకోవాలి

రెబ్బెన, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు ప్రభుత్వ ఆధ్వర్యంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకుల్లో ఖాతాల్లో తీసుకోవాలని జీఎం శ్రీనివాస్ తెలిపారు. ఎస్‌బీఐ, యూబీఐ, కెనరా బ్యాంకుల్లో ఖాతా ఉన్నట్లయితే కోటిరూపాయల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఈమేరకు సింగరేణి యాజమాన్యం ఆయా బ్యాంకులతో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు ఎకౌంటు తెరవనివారు ఉంటే వెంటనే ఈ బ్యాంకుల్లో ఖాతాలు తెరుచుకోవాలని కోరారు.

# వర్షం.. నష్టం..



దండేపల్లిలో కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుతున్న రైతులు

**5వ పేజీ తరువాయి**

మొత్తంలో ధాన్యాన్ని ప్రైవేటు మార్కెట్లో విక్రయిస్తున్నారు. సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రా లకు తరలించాల్సిన అవసరం లేకుండానే పొలా ల వద్దనే కాంటా పెడుతున్నారు. జిల్లాలో వానాకాలం సాగు ఆలస్యం కావ డంతో ఇంకా పూర్తిస్థాయిలో పంట చేతికి రాలేదు. రైతులకు నష్టం పెద్దగా వాటిల్లలేదని సమాచారం. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

నెన్నెల, (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి అకాల వర్షం కురి సింది. చేలల్లో సేకరించడానికి సిద్ధంగా ఉన్న పత్తి తడిసిపోయింది. వానతో పత్తి నల్లబారి నాణ్యత దెబ్బతింటుందని రైతులు తెలిపారు తడిసిన దూది పింజలు నీటి బరువుతో చెట్టు నుంచి జారి నేల రాలుతుందని తెలిపారు. వర్షంలో తడిసిందనే నెపంతో వ్యాపారులు ధరలో తీవ్రంగా కోతలు విధిస్తారని రైతులు వాపోతున్నారు. మరోవైపు వరి కోతలు పూర్తి చేసుకొని రాశులు పోసుకున్న రైతులు ధాన్యాన్ని తడవకుండ కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. కవర్లు కప్పి ధాన్యాన్ని వాన నుంచి కాపాడుకు న్నారు. కోతకొచ్చిన పొలాలు వాన ధాటికి నేలవాలాయి. పొలాల్లో నిలిచిన వరద నీటిలో కంకులు మునగడంతో ధాన్యం నల్లబడి పనికి రాకుండా పోతుందని రైతులు వాపోతున్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రహదారి కనిపించక పలువురు ప్రయాణికులు వాహనా లను రోడ్డుపైనే నిలిపివేశారు. ఆంధ్రాబ్యాంకు లైన్‌లో నీరు నిలిచింది.

వేమనపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడిసిపోయింది. రోజుల తర బడి ధాన్యం తూకం వేయకపోవడంతో కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యంపై టార్పాలిన్‌లు కప్పారు. తడిసిన ధాన్యం కొనాలని రైతులు డిమాండ్ చేశారు.

## మబ్బులతో కలవరపడుతున్న అన్నదాతలు

దండేపల్లి,(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కుప్పల వద్ద కవర్లు కప్పారు. అధి కారులు స్పందించి కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఇచ్చే విధంగా ప్రత్యేకచర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు తరలించే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వరిధాన్యం కుప్పలు తడిసిపోయాయి. అలాగే ఏరిన పత్తి మూటలు తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షం వల్ల వరి, పత్తి నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



నెన్నెల మండలం నందులపల్లిలో వర్షానికి తడిసిన పత్తి

ఆదివారం ప్రత్యేకం

# సైకిల్ సవారీ



- నాడు సైకిల్ ప్రధాన రవాణా సాధనం
- కిరాయికి ఇచ్చేందుకు సైకిల్ స్టాండ్లు
- ప్రస్తుతం తగ్గిపోతున్న వాడకం

బెల్లంపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సైకిల్ ప్రధాన రవాణా సాధనం... ఎంత దూరమైనా సైకిల్ పైన ప్రయాణించే వారు... క్రమంగా వాటి ప్రాముఖ్యత తగ్గి మోటార్ సైకిళ్లు, కార్లు వాడుకలోకి వచ్చాయి... ఇంటికి రెండు ద్విచక్ర వాహనాలు, కారు కామన్ అయిపోయింది. ఏ చిన్న పనికైనా నడక తగ్గించి బైక్ వాడడం సాధారణమైంది. దీంతో శారీరక శ్రమ లేకుండా అనారోగ్య బారిన పడుతున్నారు.

అయితే సైకిల్‌తో ఉన్న ఉపయోగంతో కొందరు ఇప్పటికీ వాడుతూ వారి ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి మేలు చేస్తున్నారు. ఆర్థికంగా స్థిరపడినా, ఉద్యోగం చేస్తున్నా సైకిల్‌ను వీడడం లేదు. కుటుంబ సభ్యుల మాదిరిగా సైకిల్ తమకు తోడుగా నిలిచిందని అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికీ ఆరోగ్యంగా ఉన్నామంటే సైకిల్ తొక్కడమే కారణమని పేర్కొంటున్నారు. నాటి రోజుల్లో సైకిల్ ప్రాముఖ్యతపై 'ఆదివారం' ప్రత్యేకం...

### కిరాయికి సైకిళ్లు..

మండల కేంద్రాలు, గ్రామాల్లో సైకిల్ స్టాండ్‌ల్లో సైకిళ్లను కిరాయికి ఇచ్చేవారు. గంటకు రూపాయి చొప్పున తీసుకొనే వారు. కాలక్రమేణా సైకిళ్ల వాడడం కరువరుగైంది. కిరా యికి తీసుకుని సైకిల్ తొక్కడం నేర్చుకునేవారు. ఊరికి వెళ్లాలన్నా సైకిల్ అద్దెకు తీసుకుని వెళ్ళేవారు. ప్రస్తుతం కార్లు, ద్విచక్ర వాహనాలు అద్దెకు ఇస్తున్నారు. కొందరికైతే పెళ్లిళ్లలో సైకిళ్లను కట్నంగా ఇచ్చేవారు. రాత్రి సమయంలో ప్రయాణించేందుకు డైనమోతో కరెంటు సరఫరా అయి లైటు వెలిగేది. ఎక్కువ శాతం సింగరేణి కార్మికులు బొగ్గు గనుల వద్దకు వెళ్లాలంటే సైకిల్‌పై వెళ్లేవారు. సైకిల్ తొక్క డం వల్ల శరీరంలో కేలరీలు ఖర్చవుతాయని రక్తపోటు తగ్గుతుందని, మానసిక ప్రశాంతత కలుగుతుందని వైద్యు లు పేర్కొంటున్నారు. సైకిల్ తొక్కడం వ్యాయామం లాం టిందని, గుండె ఆరోగ్యంగా ఉంటుందని తెలుపుతున్నారు.



### 24 కిలోమీటర్లు సైకిల్‌పై వెళ్లి డ్యూటీ చేశా

**మహేష్ మొండయ్య, బెల్లంపల్లి**

నేను సింగరేణి రిటైర్డు కార్మికుడిని. 2013లో రిటైర్‌మెంట్ అయ్యాను. మాది బెల్లంపల్లిలోని ఇంక్లైన్ బస్తీ. మాదారం ఎంవీకే1 గనిలో కార్మికుడిగా పనిచేశాను. 24 కిలో మీటర్లకు పైగా సైకిల్ తొక్కి డ్యూటీ చేసి ఇంటికి వచ్చే వాన్ని. ప్రస్తుతం నా వయస్సు 69 సంవత్స రాలు. 48 సంవత్సరాలు సైకిల్‌తో అనుబంధం ఉంది. ఇప్పటికీ సైకిల్ వాడుతున్నాను. నాకు ఇప్పటి వరకు కీళ్లనొప్పుల వంటి సమస్యలు లేవు.



### సైకిల్‌తో 45 ఏండ్ల అనుబంధం : జి. రాజలింగు

మాది బెల్లంపల్లి పట్టణంలోని ఇంక్లైన్ బస్తీ. నేను స్థానికంగా ఉన్న సివిల్ కోర్టులో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నా. ప్రస్తుతం సైకిల్‌పై విధులకు వెళ్తాను. రోజు 6 కిలోమీటర్లు సైకిల్ తొక్కుతాను. 45 ఏండ్ల నుంచి సైకిల్‌తో నాకు అనుబంధం ఉంది. ప్రస్తుతం నా వయస్సు 60 సంవత్సరాలు. ఇప్పటికి సైకిల్ తొక్కుతూ పూర్తి ఆరోగ్యంగా ఉన్నా.



### సైకిల్ రాజలింగు అని పేరు వచ్చింది : ఐలాల రాజలింగు

నాది బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసీ ఏరియా. నా వయస్సు 55 సంవత్సరాలు. నేను పట్టణంలోని ఓ సినిమా థియేటర్‌లో విధులు నిర్వ హిస్తున్నా. రోజు నేను విధులకు వెళ్లడానికి, వివిధ పనులకు ఇప్పటికి సైకిల్‌ను వాడుతాను. రోజుకు 5 నుంచి 6 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణం చేస్తా. నాకు తెలిసిన ఎంతో మంది నన్ను సైకిల్ రాజ లింగు అని పిలుస్తుంటారు. ఇప్పటి వరకు నాకు ఎలాంటి అనారోగ్య సమస్యలురాలేదు.



### ఎక్కడకు వెళ్లినా సైకిల్‌పై వెళ్తాను : సల్లూరి పోశం

నాది బెల్లంపల్లి పట్టణంలోని రైల్వేస్టేషన్ ఏరియా. నావయస్సు 55 సంవత్సరాలు. 36 ఏండ్లకు పైగా నేను సైకిల్ వాడుతున్నాను. ఎక్కడకు వెళ్లాలన్నా నేను సైకిల్‌పై వెళ్లి పనులు చేసుకుంటాను. రోజు కనీసం 8 కిలోమీటర్లు సైకిల్ తొక్కుతాను. ఇంట్లో ద్విచక్ర వాహనం ఉన్నప్పటికీ నా పిల్లలు వాడుతారు. రోజు సైకిల్ తొక్కడం వల్ల వ్యాయామం చేయాల్సినపని లేకుండా పూర్తి ఆరోగ్యంగా ఉంటున్నా.



## న్యూస్ బాక్స్

### రైతులకు అవగాహన

మందమర్రిరూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఊరు మందమర్రిలో శనివారం రైతులకు ఏవో కిరణ్మయి అవగాహన కల్పించారు. ఆమె మాట్లా డుతూ రైతులు తక్కువ పంట కాల పరిమితి కలిగిన మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. డిసెంబరులోనే నార్లు పోసుకోవాలని, ఎకరానికి 2 గుంటల నారుమడిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే ఏఈవోలను సంప్రదించాలన్నారు. ఏఈవో ముత్యం తిరుపతి, రైతులు రాయమల్లు, రాజన్న, వేణు, పర్వతాలు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

దండేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాసిపేట గ్రామానికి చెందిన దమ్మల్ల కళ్యాణ్ వైద్య ఖర్చులకు లక్ష రూపాయల ఎల్‌వోసీని ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు అందజేశారు. కళ్యాణ్ అనా రోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. వైద్య ఖర్చుల కోసం పార్టీ నాయకుడు లక్కాకుల సృజన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే నివాసంలో కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేశారు.

### పాఠశాలకు టీవీ అందజేత



దండేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుడిరేవు ప్రాథమిక పాఠశాల విద్యార్థుల డిజిటల్ తరగతుల కోసం టీవీని ఉపాధ్యాయురాలు తిరుమల శనివారం అందజేశారు. మెకాసిగూడ పాఠశాలలో పని చేసి బదిలీపై వెళు తున్న తిరుమలను కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయుల సమక్షంలో సన్మానిం చారు. ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, బండ ప్రేమ్‌సాగర్, దేవకి, బొలిశెట్టి బుచ్చన్న, సుజాత పాల్గొన్నారు.

### వెనుకడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కోటపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనకబడిన విద్యా ర్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఏసీఎంవో రాజమౌళి అన్నారు. శనివారం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఏటీడీఓ పురుషోత్తంతో కలిసి తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం స్లిప్ టెస్టులు నిర్వహించాలని సూచిం చారు. చదువులో వెనుకబడిన వారికి రాత్రివేళల్లో విద్యాబోధన చేయాల న్నారు. హెచ్‌ఎం అశోక్, ఉపాధ్యా యురాలు లావణ్య ఉన్నారు.

### ఆటబొమ్మలు అందజేత

దండేపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ అంగన్‌వాడి కేం ద్రంలోని చిన్నారులకు శ్రీస్వామి వివేకా నంద జిల్లా కార్యదర్శి రిటైర్డ్ హెడ్మా స్టర్ ఇప్ప లచ్చన్న రూ.10వేల విలువ గల రకారకాల ఆట బొమ్మలను శని వారం అందజేశారు. అంగన్‌వాడి టీచర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

బెల్లంపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీజేపీ రాష్ట్ర కార్య వర్గసభ్యులు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదని నిరసిస్తూ శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఏడాది కాలంలో ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజా పాలన సంబరాలు చేయడం సిగ్గు చేటన్నారు. రైతులను, ప్రజలను ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్థానికంగా ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చి హైద్రాబాద్‌కే పరిమితం అయ్యాడన్నారు. కాంగ్రెస్ నాయకులు భూకబ్జాలకు పాల్పడుతున్నా అధికారులు చర్యలు చేపట్ట డం లేదన్నారు. కేశవరెడ్డి, సంతోష్, రాజులాల్ యాదవ్, శేషగిరి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు సిర్పూర్ ఎమ్మెల్యే భూమి పూజ

భీమిని, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక నిధులు ప్రవేశ పెడుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శనివారం కేస్లాపూర్ పంచాయతీ పరిధిలోని కొత్తగుడ, గట్టుపల్లి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రానికి రూ.18 లక్షలతో ప్రహరీ నిర్మాణాలకు, రూ.5 లక్షలతో అంగన్వాడీ కేంద్రం, రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. తంగళ్లపల్లిలో నెలకొన్న భూ సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింగారావు, భీమిని, కన్నెపల్లి కాంగ్రెస్ అధ్యక్షులు గాధం లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, మాజీ సర్పంచు గడ్డం ఎల్లాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్‌గౌడ్, సంగర్స్ రవీందర్‌రావు, పనాస ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లు నిలిపివేత

తాండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రేపల్లెవాడ జన్నింగ్ మిల్లులోని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఈ నెల 9 నుంచి 11 వరకు పత్తి కొనుగోళ్లు జరగవని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి తిరిగి కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు.

# వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

దండేపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్టి పురస్కరించుకుని శనివారం గూడెం అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, గురుస్వామి పురుషోత్తమచార్యులు ఆధ్వర్యంలో సుబ్రహ్మణస్వామికి అష్టోత్తర శత కలశాభి షేకం, హోమం పూజలు చేశారు. అయ్యప్ప భక్తులు కీర్త నలు ఆలపించారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదా నంతోపాటు తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

**హాజీపూర్, (ఆంధ్రజ్యోతి):** వేంపల్లిలోని భక్తాంజనేయ సహిత శివకేశవ ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి షష్టి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప గురు స్వామి చింతపండు శ్రీనివాస్ స్వామి ఆధ్వర్యంలో వైభవంగా పూజలు నిర్వహించారు.

**శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి):** శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఆదివారం నిర్వహించనున్న అయ్యప్ప స్వాముల మహాసంగమం, మహా పడిపూజను పురస్క రించుకొని శనివారం నగర సంకీర్తన నిర్వహించారు. అయ్యప్ప, గణపతి చిత్రపటాలతో కీర్తనలు, భక్తి గీతాలతో ముందుకు సాగారు. ఆదివారం నాటి పడిపూజ ను విజయవంతం చేయాలని అఖిల భారతీయ అయ్య ప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) నాయకులు బొడ్డు లక్ష్మణ్, వీరభద్రస్వామి, శ్రావణ్, తదితరులు కోరారు.



స్వామి వారి కల్యాణంలో ఆలయ వ్యవస్థాపకులు పురుషోత్తమచార్యులు, హోమంలో పాల్గొన్న భక్తులు

# బీఆర్‌ఎస్ హయాంలోనే గురుకులాల ఏర్పాటు

జైపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ ఎస్ హయాంలోనే గురుకులాల ఏర్పాటు జరిగిందని ఆ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేష్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సం క్షేమ బాలుర గురుకుల పాఠశాలను సంద ర్శించి మాట్లాడారు. విద్యార్థులు బాగా చదు వుకొని ప్రయోజకులు కావాలని సూచించారు. గురుకుల పాఠశాలల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని విద్యా ర్థులను తెలుసుకున్నారు. ఆహారంలో నాణ్యత లోపిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. నాయకులు మేడి తిరుపతి, బడుగు రవి, సంపత్, చైతన్య, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు రాజారమేష్

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌లు జరుగుతున్న దృష్ట్యా శనివారం చెన్నూరులోని మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను బీఆర్‌ఎస్ నాయకులు తనిఖీ చేశారు. వంట గది, వం డిన ఆహారాన్ని పరిశీలించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం గురుకులాల్లోని సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో గురుకులాల్లో మెరు గైన సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ విద్యార్థి నిశాంత్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సి పాల్ దూట శ్రీధర్ తెలిపారు. శనివారం విద్యార్థిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ గత నెల 28న బెల్లంపల్లిలో జరిగిన జోనల్ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడని, నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ విజయసాగర్, వ్యాయామ ఉపాధ్యాయుడు వామన్, రాజశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

## రైతులను పట్టించుకోని ప్రధాని

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ రైతు సమస్యలను పట్టించుకోవడం లేదని సీపీఐఎంఎల్ న్యూడెమో క్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం మార్క్స్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లా డుతూ రైతులు పండించిన పంటలకు 50 శాతం గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అసంఘటిత కార్మికులకు నెలకు వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను మోదీ ప్రభుత్వం వీడనాడాలన్నారు. నాయకులు చాంద్‌పాషా, లాల్‌కుమార్, శ్రీనివాస్, బ్రహ్మానందం, రామన్న, మల్లన్న, జ్యోతి పాల్గొన్నారు.

## టైగర్ జోన్‌లో విద్యార్థుల పర్యటన

జన్నారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో శనివారం హైద్రాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యు లార్ అండ్ మాల్యులర్ బయోలజీకి చెందిన పీహెచ్‌డీ విద్యార్థులు పర్యటించారు. సఫారీ వాహనంలో గోండుగూడ, బైసన్‌కుంట, మల్యాల వాచ్ టవర్, కామన్‌పల్లి వాచ్ టవర్‌లను వీక్షించారు. ఎఫ్‌ఆర్‌వో సుష్మారావు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

చెన్నూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడంపై పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శనివారం బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ నాలుగు కోట్ల మంది ప్రజల అస్తిత్వానికి ప్రతిరూపమైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ వైఖరిని మార్చుకోవాలన్నారు. లేకపోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు.

# ఉచిత ప్రయాణంతో ఉపాధి కోల్పోతున్నాం

**జిల్లా వ్యాప్తంగా ఆటోల బంద్**



బెల్లంపల్లిలో మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు

బెల్లంపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణం పథకంతో తాము ఉపాధి కోల్పోతున్నామని ఆటో యూనియన్ జేఏసీ అధ్యక్షుడు కట్ట రామ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గంలో ఆటోల బంద్ పాటించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలకు గిరాకీ లేకుండా పోయిందని తెలిపారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఆటో డ్రైవ ర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, సంవత్సరానికి రూ. 15 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ నాయకులు రాజం, శ్రీనివాస్, సతీష్, అఖిల్, సమ్మయ్య, గోపి, మల్లేష్, కిశోర్, రాంచందర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**దండేపల్లి, (ఆంధ్రజ్యోతి):** మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణంతో ఆటో లకు గిరాకీ తగ్గిందని, ప్రభుత్వం ఆదుకోవాలని మండ లంలోని ఆటో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటో యజమా నులు, డ్రైవర్స్ ఆటోల బంద్ చేపట్టారు. తాళ్ళపేటలో ఆందోళన చేశారు.

## హనుమాన్ ఆలయంలో మాజీ మంత్రి పూజలు



పూజలు చేస్తున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

జన్నారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం మండలంలోని ఇందన్‌పల్లి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజారి హరికృష్ణ తీర్థ ప్రసా దాలను అందజేశారు. నాయకులు రాంచందర్, ప్రదీప్, గోవర్ధన్‌రెడ్డి, రమణారెడ్డి, నర్సగౌడ్,గంగారెడ్డి, విక్రమ్, శ్రీధర్, రమేష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు సరికాదు

గర్మిళ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వెలమ సామాజిక వర్గం పట్ల షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శని వారం ఆయన మాట్లాడుతూ కులాల పట్ల తన అక్కసును వెళ్లగ క్కడం సరైంది కాదన్నారు. సీఎం ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు.

- ప్రస్తుత ప్రభుత్వంపై సామాన్యుల ఆశలు
- ఏడాది గడుస్తున్న కాంగ్రెస్ పాలన




# కొత్త రేషన్ కార్డుల జాడేది?

బెజ్జూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు అనేది ప్రజల జీవనస్థితికి అద్దం పట్టే ఓ కొలమానంగా భావించవచ్చు. అలాంటి రేషన్ కార్డు అందజేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రభుత్వం అందజేసే ఏ సంక్షేమ పథకానికైనా మొదట అడిగేది రేషన్ కార్డునే. జిల్లాలో రేషన్ కార్డు లేక చాలా మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తు చేసుకుని ఏళ్లు గడుస్తున్నా కార్డు రాక కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదు.

**● జారీలో విఫలం..**

ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తోన్న ఇంతవరకు కొత్త రేషన్‌కార్డులు జారీ చేయలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చాలామంది రేషన్‌కార్డులు రద్దు చేశారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం కొందరికి కొత్తగా రేషన్ కార్డులు జారీ చేసింది. తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్న కొందరు ఆపరేటర్ల వల్ల రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు గల్లంతయ్యాయి. ప్రభుత్వం మరోసారి అవకాశం ఇవ్వకుండా పేర్లు చేర్చకుండా ఉండిపోయింది. కొత్తగా చాలా మందికి వివాహాలు జరిగాయి. వారికి రేషన్ కార్డులు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైంది. ఫలితంగా చాలా మంది కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కొత్త రేషన్ కార్డులిస్తారని, రేషన్‌కార్డులోని తప్పులు సవరించుకోచ్చని ప్రజలు భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల ఊసెత్తకపోవడంతో చాలామంది ప్రజలు నిరాశలో ఉంటున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఎంతో ప్రాముఖ్యత ఉన్న రేషన్‌కార్డులు జారీచేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అవుతోంది.

**● నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నా..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్తగా రేషన్ కార్డులు, కార్డుల్లో పేర్ల నమోదు, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు చేసుకొని సంవత్సరాలు గడిచినా కార్యరూపం దాల్చలేదు. కొత్త రేషన్ కార్డుల కోసం వేల సంఖ్యలో లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. రాష్ట్రంలో అధికారంలో చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ కోసం పలుమార్లు ప్రకటనలు చేసినా ఇంకా కార్యరూపం దాల్చలేదు. రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తుండటంతో లబ్ధిదారుల్లో అసహనం వ్యక్తమవుతోంది. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డుల కోసం 13,265మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు ఆ సంఖ్య రెట్టింపుగా ఉన్నది. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1,37,284కార్డులు ఉన్నాయి. ఇందులో అంత్యోదయ 12,948, తెల్ల రేషన్ కార్డులు1,24,336 ఉండగా వీటికి ప్రతి నెలా రేషన్ దుకాణాల ద్వారా 2,968టన్నుల బియ్యం పంపిణీ జరుగుతోంది. ఇంకా కొత్త ప్రభుత్వంలో ప్రజాపాలన ద్వారా వేల సంఖ్యలో దరఖాస్తులు తీసుకున్నా వాటికి ఎప్పుడు ముహూర్తం కలుగుతుందోనని లబ్ధిదారులు అంటున్నారు.

**రేషన్ కార్డులు ఇచ్చేదెప్పుడు?**
-ఇప్ప బాపు, బెజ్జూరు



కొత్తగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొని ఏడాది కావస్తోంది. ఇంతవరకు రాలేదు. రేషన్ కార్డు లేక ప్రభుత్వ సంక్షేమపథకాలు అందడం లేదు. ప్రభుత్వం రేపు, మాపు అంటూ కొత్త కార్డులపై కాలయాపన చేస్తోంది. దీంతో తమకు ఏ ప్రభుత్వ పథకం అందడం లేదు.

## చట్టాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు:ఏఎస్పీ



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రభాకర్‌రావు

ఆసిఫాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నూతన చట్టాలపై పోలీసులకు, సిబ్బందికి నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏఎస్పీ ప్రభాకర్ రావు అన్నారు. శనివారం పోలీసుస్టేషన్ రైటర్లకు, సీసీటీఎన్ ఎస్ రైటర్లకు, కోర్టుడ్యూటీ అధికారులు, న్యాయనిపుణులు, ఎస్టీ, ఎస్టీ కోర్టు ఆదిలాబాద్ పీపీ రమణారెడ్డి, డిస్ట్రిక్‌కోర్టు పీపీ జగన్మోహన్ రావు, పోక్సోకోర్టు పీపీ జీవీఎస్‌ప్రసాద్‌తో నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన న్యాయచట్టాల ద్వారా దర్యాప్తు వేగవంతంగా చేయడంతోపాటు బాధితులకు సత్వరన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, సీఐ బుద్దెస్వామి, శ్రీనివాస్, సత్యనారాయణ, ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, ఎస్సైలు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కాగజ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణసీఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం మహాత్మాజ్యోతి బాపూలే పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజికఅంశాలపై విద్యార్థులకు అవగాహణ ఉండాలన్నారు. నూతనచట్టాలు, రోడ్డు ప్రమాదాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్, కళాజాతా బృందసభ్యులు రాంచందర్ రోహిత, చంద్రశేఖర్, రజిత, సంఘవి పాల్గొన్నారు.

## వందశాతం ఫలితాలు సాధించాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకులలో చదువుతున్న పదవ, ఇంటర్మీడియట్‌విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రణాళి కలు సిద్ధంచేయాలని గురుకులంఅడ్మిన్ అసిస్టెంట్‌సెక్రెటరీ రాజబాబు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పీటీజీ గిరిజన గురుకులాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. మెనూపా టిస్తూ విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు భద్రయ్య, సుజాత, ఓంకార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చలో ఇంద్రవెల్లిని విజయవంతం చేయండి

బెజ్జూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 9న నిర్వహించే చలో ఇంద్రవెల్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండలసర్‌మేడి కొడప శంకర్, ఆది వాసీ సంఘాల నాయకులు సకారాం, తిరుపతి కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఆదివాసీభవనంలో వారు మాట్లాడారు. ఆదివాసీ సంఘాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఆదివాసీ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు భవిష్యత్‌లో నిర్వహించే కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నమునా పరిశీలన

సిర్పూర్(టి), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇంటి నమునాను నిర్మించేందుకు ఎంపీడీవో సత్యనారాయణ శనివారం స్థలపరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డీవో మాట్లాడుతూ మండలంలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్ల నమునా ప్రకారం నిర్మిస్తామన్నారు. అలాగే మండలంలోని 16గ్రామ పంచాయతీల్లోని 27గ్రామాల్లో 144పోలింగ్‌కేంద్రాలను ఎన్నికలకు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్‌కేంద్రాల ఎంపికపై అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

**వాంకిడి:** మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇంటి నిర్మించేందుకు నమునాను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ శనివారం స్థలపరి శీలన నిర్వహించారు. మండలంలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్ల నమునా ప్రకారం నిర్మిస్తామన్నారు.

## ఐసీడీఎస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు అందిస్తున్నసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ సీడీపీవో సాదియా రుక్సాన అన్నారు. శనివారం మండలంలోని కొండపల్లిలో ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా టీచర్లు ఏర్పాటు చేసిన బాలమేళ కార్యక్రమంలో మాట్లాడారు. ఐసీడీఎస్‌ద్వారా పిల్లలకు గర్భిణులకు, బాలింతలకు పౌష్టిహాకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కళావతి, అంగన్వాడీటీచర్లు సంతోషి, రాజేశ్వరి, షకీలా, తిరుపతమ్మ, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలను తరలించే ప్రయత్నాన్ని విరమించుకోవాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): టైగర్‌కారిడార్ పేరుతో ఆదివాసీలను అడవులనుంచి తరలించేప్రయత్నం చేస్తే ఉపేక్షించేదిలేదని ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని రాయి సెంటర్‌లో తొమ్మిదితెగల ఆదివాసీ సంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామసభల తీర్మాణం లేకుండా టైగర్ కారిడార్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. టైగర్ కారిడార్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు అర్జు మాస్టారు, సుధాకర్, విజయ్, మోతిరాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు విడుదల చేయాలి

జైనూర్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల్లో విధులు నిర్వర్తి స్తున్న కారోబార్లు, కార్మికులకు వేతనాలు విడుదల చేయాలని మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్మికులు శనివారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కనీసం దసర,దీపావళి పండుగలకు కూడా విడుదల చేయ లేదని వచ్చేసంక్రాంతి పండుగలోపైనా తమకు వేతనాలు విడుదల చేయాలని పంచాయతీ పారిశుధ్యకార్మికులు వినతిపత్రంలో వేడుకున్నారు. కార్యక్రమంలో కారోబార్లు, కార్మికులు కొద్దు,శాంతయ్య,మానిక్‌రావ్,మోతీరాం,మనోహర్ ఉన్నారు.

## కొనుగోలు కేంద్రంను తనిఖీ

తిర్యాణి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంభీరావుపేటలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ సూర్యప్రకాష్ పరిశీలించారు. తేమశాతం 17ఉండేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. తేమశాతం తక్కువ ఉంటే రెండురోజులు ఎండలోఆరబెట్టి తీసుకు రావాలన్నారు.

## ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి షష్టి వేడుకలు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యస్వామి షష్టి వేడుకలను అయ్యప్ప స్వాములు ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెద్దవాగు సమీపంలోవెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి జన్మదిన వేడుకలను అర్చకుడు నాగేశ్వర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

## జాతీయస్థాయి బాల్‌బాడ్మింటన్‌కు ఎంపిక



ఎంపికైన సిద్ధార్థ రాజ్

రెబ్బెన, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బాల్ బాడ్మింటన్ క్రీడాఫెడరేషన్ కప్‌కు గోలేటి క్రీడాకారుడు కె సిద్ధా ర్థరాజ్ ఎంపికైనట్టు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్‌బాడ్మింటన్ ప్రధానకార్యదర్శి ఆర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈనెల6 నుంచి 8వరకు కర్ణాటకలో ఈ క్రీడలు జరుగుతాయన్నారు. సిద్ధార్థరాజ్ జాతీయస్థాయిలో ఐదుసార్లు, సీనియర్ నేషనల్‌లో నాలుగుసార్లు, సబ్‌జూనియర్ నేషనల్‌లో రెండుసార్లు పాల్గొన్నట్టు తె లిపారు. ఆయన ఎంపికపై రాష్ట్ర బాల్ బ్యా డ్మింటన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అభినందించారు.

## సీఎంను కలిసిన గుండా శ్యామ్



సీఎంతో గుండా శ్యామ్

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాంగ్రెస్‌పార్టీ యువజనసంఘం ఎన్నికల్లో జిల్లాఅధ్యక్షుడిగా గెలుపొందిన గుండాశ్యామ్ ఆపార్టీరాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డితో కలిసి శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మరింతఉత్సాహంగా పనిచేయాలని సీఎం సూచించినట్లు పేర్కొన్నారు.

## ఆదివాసుల మహాసభకు వేలాదిగా తరలిరావాలి

జైనూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల9 ఇంద్రవెల్లిలో నిర్వహించ తలపెట్టిన ఆదివాసుల మహాసభకు ఆదివాసులు, మేధావులు, వేలాదిగా తరలిరావాలని తుడుందెబ్బ జిల్లా ప్రధానకార్యదర్శి ఉయిక చందన్‌షావ్ కోరారు. మండల కేంద్రంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఆదివాసుల హక్కులు, చట్టాలు పకడ్బందీగా అమలుపరచి న్యాయంచేయాలనే ఆదివాసీ మహాసభ ఏర్పాటు చేశామన్నారు. సంఘం జిల్లా కన్వీనర్ గేడాం గోపిచంద్, కనకప్రతిభ పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు సన్మానం

తిర్యాణి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్లిన తహసీల్దార్ సునీల్‌కుమార్‌ను శనివారం తహసీల్దార్ సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో సిబ్బంది, రేషన్‌డీలర్లు సన్మానించారు. ఎంపీడీవో మల్లేష్, డీటీ వంశీకృష్ణ, సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాల సాధన దిశగా కృషి చేయాలి: కలెక్టర్



మాదకద్రవ్యాల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షికపరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలపాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో వార్షిక పరీక్షల నిర్వహణ, ఫలితాలసాధనపై సమీక్షా సమావేశం న్విహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే వార్షికపరీక్షల్లో అత్యున్నత ఫలితాలు సాధించి జిల్లాను ముందు వరుసలో ఉండేలా అధ్యాపకులు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. వార్షికపరీక్షలకు ఇంకా 80రోజులు మాత్రమే ఉన్నాయని, విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధంచేయాలని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి అపోహలు, భయం లేకుండా పరీక్షలకు హాజరయ్యే విధంగా మనోధైర్యాన్ని కలిగించాలని తెలిపారు. ప్రభుత్వ కళాశా లలో విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. నషాముక్త్ భారత్ కింద కళాశాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాల న్నారు. జిల్లాను గతంలోకంటే మెరుగైనస్థానంలో ఉండే విధంగా అందరూ కృషిచేయాలని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యాధికారిణి కళ్యాణి, జిల్లా వైద్య ఆరోగ్యశా ఖాధికారి సీతారాం, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**ఈవీఎంల భద్రతకు పటిష్ఠ బందోబస్తు..**

జిల్లాలో ఎలక్ర్టానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు గోదాం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికలఅధికారి కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపుపొందిన రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో సాధారణ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాం వద్ద పటిష్ఠమైన రక్షణ చర్యలు చేపట్టామన్నారు. సీసీకెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. 24గంటలు, సీసీకెమెరాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటాని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**విజయవంతంగా ప్రజావిజయోత్సవాలు..**

ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తవుతున్నందున రాష్ట్రంలో అమలుచేస్తున్న ఆరు గ్యారెం టీలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజ లందరికీ తెలిసే విధంగా చేపట్టిన ప్రజాపాలన- ప్రజావిజయోత్సవాలు సాంస్కృతిక ప్రదర్శనలు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే తెలిపారు. జిల్లాలో 15మండలాల్లో 57గ్రామాలతోపాటు కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలలో సాంస్కృతిక ప్రదర్శన ద్వారా ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

**క్రీడాస్ఫూర్తితో పోటీల్లో విజయం సాధించాలి..**

**ఆసిఫాబాద్ రూరల్:** క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడివిజయం సాధించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ప్రజాపాలన ప్రజావిజ యోత్సవాల్లో భాగంగా శనివారం ఆసిఫాబాద్ మండలంలోని వట్టి వాగు, ఆర్‌అండ్‌ఆర్‌కాలనీ (పాడిబండ) గ్రామాల్లో గ్రామ పంచాయతీ స్థాయి సీఎంకప్ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎంకప్ క్రీడాపోటీలను గ్రామ,మండల,జిల్లాస్థాయిలలో నిర్వహించి మెరుగైనప్రదర్శన కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తామన్నారు. జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదని, జాతీయస్థాయిలో జిల్లా క్రీడాకారులు రాణించాలన్నారు. వారిని స్ఫూర్తిగాతీసుకొని మరింత మంది క్రీడారంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమక్రీడాభివృద్ధి అధికారి మీనారెడ్డి, పీఈ టీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లాలో కురిసిన మోస్తరు వర్షం



కాగజ్‌నగర్‌లో కురుస్తున్న వర్షం

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్/దహెగాం/కెరమెరి, డిసెంబర 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం ఓ మోస్తరు వర్షంకురిసింది. ఆసి ఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతో పాటు కెరమెరి, వాంకిడి, రెబ్బెన, లింగాపూర్, దహెగాం, పెంచికల్ పేట మండలాల్లో వర్షంకురిసింది. జిల్లాలో కురిసిన వర్షానికి దహెగాం మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆర బెట్టిన వరిధాన్యం తడిసి పోయింది. ఆసిఫాబాద్‌లో కురిసిన వర్షానికి వరదనీరు రోడ్లపై వచ్చిచేరింది. జిల్లాలో కురిసి న వర్షానికి పత్తిపంట ఎరివేతకు అటంకం కలిగింది. కాగజ్‌నగర్ పట్టణంలో కాలనీలో ఉన్న అంతర్గతరోడ్లు బురదమయం అయ్యాయి. చిరువ్యాపారులు ఇబ్బందిపడ్డారు.

## కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల నిరసన

కాగజ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఆరవ వార్డు కౌన్సిలర్ పిర్సింగుల జయచందర్ ఇంటి ఎదుట నీటిసరఫరా విభాగానికిచెందిన కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు శనివారం నిరసన చేపట్టారు. తమకు గ్రూపు చేయిస్తానని చెప్పిఫీజులు కట్టించుకున్న కౌన్సిలర్ ఇంతవరకు చేయించలేదన్నారు. తమకు గ్రూపుచేయిస్తేనే జీతాల సమస్య తీరుతుందని తెలిపారు. అనంతరం సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



కౌన్సిలర్ ఇంటి ఎదుట నిరసన చేస్తున్న కార్మికులు

## విద్యార్థిని శైలజ మృతి దురదృష్టకరం

**ఐటీడీఏ పీవో**

వాంకిడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మరణం దురదృష్టకర మని సమగ్ర గిరిజ నాభివృద్ధి సంస్థ అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు ఆసిఫాబాద్, మంచిర్యాల, హైదరాబాద్‌లలో ఆసుపత్రులలో వైద్యం అందించామన్నారు. అయిన ప్పటికీ శైలజ కోలు కోకపోవడం దురదృష్టకరమన్నారు.

## పులి వదంతులు నమ్మవద్దు

కెరమెరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పులి వదంతులు నమ్మవద్దని ఎఫ్ఆర్వో మజారుద్దీన్ అన్నారు. శనివారం ఆయన ఝరి, కోలాంఝరి గ్రామాల్లో పులి వదంతులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతాల్లో పులి అడుగులు లభ్యం కాలేదని తెలిపారు.

# విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా కృషి

● రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్



వాంకిడిలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న విద్యాశాఖ కమిషన్ సభ్యుడు డాక్టర్ చారుకొండ వెంకటేష్


ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్టంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేదిశగా విద్యాకమిషన్ ప్రత్యేకదృష్టి సారించిందని రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థ బలోపేతం, మౌలికవసతుల కల్పనపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు అందిస్తున్న బోధన, వసతుల కల్పనపై రాష్ట్రమంతా పర్యటించి ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామని తెలిపారు. అంతకుముందు పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే, మోడల్ స్కూల్, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, స్టోర్‌రూంలను పరిశీలిం చారు. సమావేశంలో జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు, ఏడి గమేనియల్, జిల్లా సైన్స్ అధికారి మదుకర్, ఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

**విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..**

**వాంకిడి:** గిరిజనఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థినుల ఆరో గ్యంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవా లని విద్యాశాఖ కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం గిరిజన ఆశ్రమపాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను అడిగితెలుసుకున్నారు. భోజన, మంచి నీటి వసతులపై విద్యార్థినులను, ఉపాధ్యాయులను అడిగితెలుసు కున్నారు. విద్యార్థిని శైలజమృతికి కారణాలను అడిగితెలుసుకున్నారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినులకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. సరిపడ మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు నిర్మించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థినులకు సరి పడా అదనపుగదుల నిర్మాణాలతోపాటు డైనింగ్ హాల్, వంటగది నిర్మించేలా చూస్తామన్నారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ ఏడీ గమ్మునల్, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ అబిద్‌అలీ, జిల్లాసైన్స్ అధికారి కటుకం మధుకర్, భాగ్యలక్ష్మి, డీటీడీవోరమాదేవి, ఎంఈవో శివచరణ్ కుమార్, డీటీ దుర్గం శ్రావణ్ పాల్గొన్నారు.

# అడవుల సంరక్షణ సామాజిక బాధ్యత

● పీసీసీఎఫ్ ఆర్‌కే డోబ్రియాల్



పెంచికలపేట అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ ఆర్‌కే డోబ్రియాల్

పెంచికలపేట, డిసెంబరు 7(ఆంధ్ర జ్యోతి): అడవుల సంరక్షణ ఒక సామా జిక బాధ్యత అని పీసీసీఎఫ్ ఆర్‌కే డోబ్రియాల్ అన్నారు. శనివారం క్షేత్ర పర్యటనలో భాగంగా మండలంలోని కొండపల్లి అటవీప్రాంతం, పెంచికల పేట బీట్‌లోగలబోల్ మెత్తంగడ్డి క్షేత్రం, టైగర్ మూమెంట్ ఏరియా, గుండెపల్లి బేస్‌క్యాంపు, పాలరాపుగుట్ట రాబందుల ఆవాసాలను ఆయన పరిశీలించారు. ముందుగా నూతనంగా నిర్మించిన బీట్ ఆఫీసర్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీపరిరక్షణకు ప్రతిఒక్కరు సహకరించాలని అన్నారు. వన్య ప్రాణులను వేటాడితే కఠినచర్యలు తప్పవన్నారు. అటవీ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, కెమెరా ట్రాప్‌లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ కదిలికలను గుర్తించా లని సిబ్బందికి సూచించారు. ఆయనవెంట స్టేట్ వైల్డ్‌లైఫ్ చీఫ్ వార్డెన్ ఏలూసింగ్ మేరు, జిల్లా అటవీఅధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్, డీఎఫ్‌వో వినయ్ కుమార్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో వేణుబాబు, ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్, ఎఫ్ఆర్వో రమాదేవి, డీఆరోలు జమీల్ అహ్మద్, ముసావీర్, వేణుగోపాల్, అస్మా, జగన్మోహన్‌గౌడ్ ఉన్నారు.

**ఏకో వంతెనను పరిశీలించిన పీసీసీఎఫ్..**

**వాంకిడి:** మండలంలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన గణేష్‌పూర్ గ్రామశివారులో అటవీ జంతువులు దాటడానికి నిర్మించిన సీతావో ఏకో బ్రిడ్జిని రాష్ట్రఅటవీశాఖ ప్రధాన సంరక్షణ అధికారి రాకేష్‌మోహన్ డోబ్రియాల్ పరిశీలించారు. ఏకో బ్రిడ్జిపై జరగాల్సిన మిగిలిన పనులను త్వరగా పూర్తిచేయాలని నేషనల్‌హైవేఅథారిటీ అధికారులను ఆదేశించారు. ఆయనతోపాటు పీసీసీఎఫ్ వైల్డ్‌లైఫ్ ఏలుసింగ్‌మేరు, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, డీఎఫ్‌వో వేణుబాబు, ఎఫ్ఆర్వో గోవింద్‌చంద్, ఎఫ్ఆర్వో రమాదేవి, ఎఫ్ఎస్ఎవ్ సతీష్‌కుమార్, సహీద్, తదితరులు పాల్గొన్నారు.